సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



విజిలెన్స్ దాడులు

ఏలూరులో చేపల మేతలు, మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. రూ.40,73,329 విలువైన చేపల మేత, మందులు సీజ్ చేశారు. 8లో ▸



పోటెత్తిన భక్తులు


ఐఎస్ జగన్నాథపురం క్షేత్ర పురవీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి మంగళవారం రాత్రి అట్టహాసంగా ఊరేగారు. సుందరగిరిపై భక్తులు పోటెత్తారు 8లో ▸



దివ్యాంగుల కష్టాలకు చెక్

రైల్వే పాసుల కోసం దివ్యాంగులు స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేసే విధానానికి రైల్వే శాఖ చెక్ పెట్టింది. వారి కోసం రైల్వే శాఖ వెబ్‌సైట్ ప్రారంభించింది. 8లో ▸

బర్డ్‌ఫ్లూ కలకలం



- వేల్పూరు పౌల్ట్రీలోని కోళ్లకు వైరస్ నిర్ధారణ
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- పౌల్ట్రీ నుంచి కిలోమీటరు వరకు ఇన్ఫెక్షన్ జోన్‌గా ప్రకటన
- 10 కిలోమీటర్ల వరకు అలర్ట్ జోన్‌గా గుర్తింపు
- ఇన్ఫెక్షన్ జోన్‌లోని 5 పౌల్ట్రీల్లో ప్రస్తుతం 55 వేలకు పైగా లేయర్ కోళ్లు
- అన్నింటినీ తొలగించేందుకు చర్యలు
- అలర్ట్ జోన్‌లో గుడ్లు, చికెన్ వినియోగంపై నిషేధాజ్ఞలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం రేపుతోంది. తణుకు రూరల్ మండలం వేల్పూరులోని పౌల్ట్రీలో కోళ్ల మరణాలకు ఎవియాన్ ఇన్‌ఫ్లూయంజ్ (హెచ్5ఎన్1) వైరస్‌గా నిర్ధారణ కావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ అయిన పౌల్ట్రీ నుంచి కిలోమీటరు వరకు ఇన్ఫెక్షన్ జోన్‌గా, 10 కిలోమీటర్ల వరకు అలర్ట్ జోన్‌గా అధికారులు ప్రకటించారు.





వైరస్‌తో చనిపోయిన కోళ్లు

సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, అత్తిలి, ఇరగవరం, ఉంగుటూరు, దేవరపల్లి, ఉండ్రాజవరం తదితర మండలాల్లో దాదాపు 200 పౌల్ట్రీలు ఉన్నాయి. గుడ్లు పెట్టే కోళ్లు కోటీ 30 లక్షల వరకు ఉండగా, రోజుకు కోటీ 5 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. లక్ష కోళ్లు ఉన్న పౌల్ట్రీలో సాధారణంగా ఆరోగ్య సమస్యలు, ఇతర కారణాలతో రోజుకు 20 నుంచి 50 వరకు లేయర్ కోళ్లు చనిపోతుంటాయి. అందుకు భిన్నంగా పలు పౌల్ట్రీల్లో కొద్ది రోజులుగా అంతుచిక్కని లక్షణాలతో మూడు వేల నుంచి ఐదు వేల వరకు కోళ్లు చనిపోతుండటాన్ని ఇటీవల 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. తణుకు రూరల్ వేల్పూరులోని కృష్ణానందం పౌల్ట్రీలోని చనిపోయిన కోళ్ల శాంపిల్స్ పరీక్షలకు పంపగా బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ అయ్యింది.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

హానికర బర్డ్‌ఫ్లూ వైరస్ కోళ్లకు సోకడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, జెడ్పీ సీఈఓ సుబ్బారావు, డీపీఓ అరుణశ్రీ, డీఎఫ్ఓ ఆశా కిరణ్, డీఎస్ఓ బి.సరోజ, డీఎంహెచ్ఓ భాను నాయక్, డీటీఓ ఉమామహేశ్వరరావు తదితరులతో కలెక్టర్ సీహెచ్ నాగరాణి సమావేశమయ్యారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హాజరయ్యారు. వైరస్ నివారణ, వ్యాప్తిని అరికట్టేందుకు అత్యవసర చర్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ, విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన వైద్య సాయం అందించేందుకు ఆదేశాలిచ్చారు. వైరస్ వ్యాప్తికి గల కారణాలను గుర్తించే నిమిత్తం అడవి, వలస పక్షుల మరణాలు ఆ ప్రాంతంలో ఏమైనా జరిగితే పరిశీలించాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు.

పడిపోయిన చికెన్ ధర

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు ఆరున్నర లక్షల కోళ్లు పెంచే సామర్థ్యం ఉన్న బ్రాయిలర్ షెడ్లు ఉన్నాయి. వైరస్ కారణంగా బ్రాయిలర్ కోళ్ల మరణాలు ఎక్కువగానే ఉన్నాయి. నిన్నమొన్నటి వరకు మార్కెట్‌లో రూ.200 నుంచి రూ.220 వరకు ఉన్న కిలో చికెన్ ధర బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ఒక్కసారిగా పతనమైంది. ప్రస్తుతం కిలో చికెన్ ధర రూ.150 వరకు పలుకుతోంది. గుడ్డుకు సంబంధించి నెక్ ప్రకటిత రైతు ధర రూ.4.55 ఉండగా, రైతులకు ట్రేడర్లు ఇస్తున్నది రూ.4 లోపే ఉంటోందని పౌల్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్న పౌల్ట్రీ రంగం బర్డ్‌ఫ్లూ కారణంగా మరింత సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఇన్ఫెక్షన్, అలర్ట్ జోన్ల గుర్తింపు

వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు కృష్ణానందం పౌల్ట్రీకి కిలోమీటరు వరకు ఇన్ఫెక్షన్ జోన్‌గా, 10 కిలోమీటర్ల పరిధిని అలర్ట్ జోన్(సర్వైలెన్స్ జోన్)గా గుర్తించారు. ఇన్ఫెక్షన్ జోన్‌లో ఐదు వరకు పౌల్ట్రీలు ఉండగా.. ప్రస్తుతం వాటిలో 55 వేల వరకు కోళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. కేంద్రం మార్గదర్శకాల మేరకు వీటన్నింటినీ శాస్త్రీయ విధానంలో సున్నం, బ్లీచింగ్, ఉప్పు, కెమికల్స్ వేసి పాతిపెట్టేందుకు వెటర్నరీ వైద్యులు, ఇతర సిబ్బందితో 20 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశారు. ఆయా పౌల్ట్రీల్లో వైరస్‌ను సమూలంగా నిర్మూలించేందుకు మూడు నెలల పాటు మూసివేసి అవసరమైన శానిటేషన్ చర్యలు చేపట్టనున్నారు.

అలర్ట్ జోన్‌లో 17 గ్రామాలు

ఇన్ఫెక్షన్ జోన్ నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో అలర్ట్ జోన్‌లో 17 గ్రామాలను గుర్తించారు. వీటిలో కొమరవరం, అత్తిలి, కావలిపురం, ఇయర్ చెరువు, గోటేరు, మండపాక, ఇరగవరం, తేతలి, రేలంగి, గుమ్మంపాడు, పాలి, వరిఘేడు, బల్లిపాడు, తణుకు, మల్లిపాడు, అర్జునుడిపాలెం ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని అన్ని చికెన్, గుడ్ల దుకాణాల మూసివేతకు ఆదేశాలిచ్చారు. ఇన్ఫెక్షన్, అలర్ట్ జోన్ లోపల, వెలుపల గుడ్ల రవాణాపై నిషేధం విధించారు. నిఘా ప్రాంతంలోని అన్ని ఫారాలూ మూడు వారాల పాటు పరిశీలనలో ఉంటాయని అధికారులు తెలిపారు. నిషేధిత ప్రాంతాల నుంచి పౌల్ట్రీ ఉత్పత్తుల రవాణాపై నిఘా కోసం వేల్పూరు హైవే, వేల్పూరు రైల్వే గేటు, అత్తిలి, వీరభద్రపురం, మల్లిపూడి, కొత్తపాడు ప్రాంతాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

న్యూస్‌రీల్

బలివే ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



బలివే ఉత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న నూజివీడు సబ్‌కలెక్టర్

ముసునూరు: సమన్వయంతో పనిచేసి బలివే మహా శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ పిలుపు నిచ్చారు. బలివేలోని శ్రీరామలింగేశ్వరాలయ ప్రాంగణంలో ఉత్సవాల నోడల్ అధికారి తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ అధ్యక్షతన ఉత్సవాల ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణను సవాలుగా స్వీకరించి విజయవంతం చేయాలన్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు, నీటి పారుదల శాఖల ఆధ్వర్యంలో 14 కల్లా తమ్మిలేరులోకి నీరు ఉండేలా చూడాలన్నారు. ఆర్ అండ్‌బీ ఆధ్వర్యంలో రహదారులకు మరమ్మతులు చేపట్టడంతోపాటు, గోతులు బాగు చేయించాలని ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం బస్సు సర్వీసులను అన్ని రూట్లలో నడపాలన్నారు. ప్రాంగణ పరిసరాలలో మద్యం విక్రయాలు నిర్వహిస్తే సహించబోనన్నారు. సమావేశంలో సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 182 మంది గైర్హాజరు

భీమవరం: జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు 182 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు చెప్పారు. ఉదయం పరీక్షకు 3,761 మంది విద్యార్థులు హాజరుకావల్సివుండగా 3,649 మంది హాజరు కాగా మధ్యాహ్నం పరీక్షకు 3,131 మందికి 3,061 మంది హాజరైనట్లు నాగేశ్వరరావు చెప్పారు.

నామినేషన్ తిరస్కరణపై ఫిర్యాదు

తాడేపల్లిగూడెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్‌ను సరైన కారణాలు లేకుండా తిరస్కరించారంటూ పెంటపాడు మండలం ముదునూరుకు చెందిన భావన ధాన్యలక్ష్మి మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. పరిశీలనలో నామినేషన్‌ను తిరస్కరించారని, అఫిడవిట్‌లో కొన్ని పేజీలలో సంతకాలు లేవన్న కారణంతో తిరస్కరించినట్టు చెబుతున్నారన్నారు. ముందుగా కలెక్టర్ సంతకం చేసిన తర్వాత మాతో సంతకాలు చేయించుకుంటామని చెప్పి, తర్వాత సంతకాలు లేవన్న కారణంతో తిరస్కరించారన్నారు. తన నామినేషన్ ఆమోదానికి ఆర్‌ఓకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశామన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణకు కృషి చేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.నాగేశ్వరరావు

ఏలూరు (మెట్రో): ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, డీఎల్ఎటీఓ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఇశ్చిత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా జైలులో ఉన్న ఖైదీలందరికీ హెచ్‌ఐవి/ఎయిడ్స్, టీబీ, సుఖవ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించింది. అనంతరం ఉచితంగా హెచ్‌ఐవీ, టీబీ, సిఫిలిస్, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి, జిల్లా సూపర్‌వైజర్ ఏ హరినాథ్ కుమార్, జైలర్ శ్రీనివాసరావు, డిప్యూటీ జైలర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు (టూటౌన్): అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి బి.ఉమాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 7 నుంచి వచ్చే నెల 6 లోపు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 9963007079, 9666699243 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

11 నామినేషన్ల తిరస్కరణ



అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లు పరిశీలిస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 11 మంది అభ్యర్థుల నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. మరో 43 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి నామినేషన్లు పరిశీలించారు. ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత పాల్గొని ఈ ప్రక్రియను పరిశీలించారు. ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేసిన రాయుడు శ్రీనివాసు, శెట్టిబత్తుల రాజాబాబు, భావన ధాన్యలక్ష్మి, కొండపల్లి శ్రీనివాసు, మహ్మద్ ఆలీ జామ్‌షీద్, డికెవి ప్రకాష్, కొరుసు రాజకీర్తి, మెర్ల శ్రీవాణి, జీవదేవ దయాకర్, నేషనల్ నవక్రాంతి పార్టీకి చెందిన పాదముత్యం ప్రతాప్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా బీఆర్ అంబేద్కర్ పార్టీకి చెందిన నీతిపూడి రామకృష్ణ నామినేషన్ పత్రాలు సక్రమంగా లేవని తిరస్కరించారు.

ప్రజల పోరాటం గెలిచింది

- మున్ముందు పశువధ శాలపై పోరాటం కొనసాగుతుంది
- మాజీ మంత్రి కారుమూరి



తణుకులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: తేతలిలో నిర్వహిస్తున్న పశువధ శాలకు న్యాయస్థానం బ్రేక్ వేస్తూ స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ ప్రాంత నివాసితులు పశువధశాల వల్ల దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని, పిల్లలు వాంతులు చేసుకుంటున్నారని ఆందోళనలు చేసినా.. వారి మనసు కరగలేదని మండిపడ్డారు. డబ్బు కోసం ఎన్ని దుర్మార్గాలు చేసినా చివరకు న్యాయమే గెలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలోనే.. ఫ్యాక్టరీకి అనుమతులు లేవనే విషయాన్ని న్యాయవాదులు నిరూపించారని గుర్తుచేశారు. పోలీసుల కాపలాతో నడిపించిన ఘనత తణుకు ఎమ్మెల్యేకి దక్కిందని విమర్శించారు. మూగజీవాలను వధించడం, రక్తం ఏరులై పారడం తణుకు ప్రాంతానికి మంచిది కాదని మొత్తుకున్నా ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. ఫ్యాక్టరీ కార్యకలాపాలపై గోసేవా సమితి సభ్యుడు కొండ్రెడ్డి శ్రీనివాస్‌తో పాటు న్యాయవాదులు, ముఖ్యంగా మీడియా పోషించిన పాత్ర అభినందనీయమని ప్రశంసించారు. న్యాయస్థానం ఉత్తర్వులు నాలుగు వారాలే అయినప్పటికీ రాబోయే రోజుల్లో ఫ్యాక్టరీని పూర్తిగా తొలగించేందుకు కార్యాచరణ చేస్తామని స్పష్టం చేశారు.

జనసేన, టీడీపీ కార్యాలయాలకు వెళ్లినా...

మంగళగిరిలోని జనసేన, టీడీపీ కేంద్ర కార్యాలయాలకు వెళ్లి ఫ్యాక్టరీ మూయించమని వేడుకుని, వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదని, ఉద్యమం చేద్దామంటే పోలీసుల సాయంతో 144 సెక్షన్ పెట్టించి ఎమ్మెల్యే పశువధ శాలను నడిపించారని కారుమూరి దుయ్యబట్టారు. అఘోరా అఖాడా జాతీయ ఉపాధ్యక్షుడు రాజేష్‌నాథ్‌జీ అఘోరీ మాట్లాడుతూ తణుకు అంటే రాకెట్ ఇంధనం సరఫరా చేసే ప్రాంతమని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా ఉందని, నేడు తణుకు అంటే పశువధశాల ప్రాంతంగా పిలవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు జల్లూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గాంధీ భగవాన్‌రాజు

పాలకొల్లు అర్బన్: అపరిష్కృతంగా ఉన్న ఆక్వా రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు డిమాండ్ చేశారు. పాలకొల్లు మండలం చందపర్రులో త్రిబుల్ ఎస్ కన్వెన్షన్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ నెల 13, 14 తేదీల్లో రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, కె.అచ్చెన్నాయుడు, అప్సడా చైర్మన్‌ను కలిసి వినతిపత్రాలు అందజేయాలని తీర్మానించారు. హేచరీ కంపెనీలు నాణ్యమైన సీడు అందించాలని, రొయ్యల మేత తయారీ కంపెనీలు ధరలు తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ తగ్గించడం లేదని ఆయన మండిపడ్డారు. ఎంపెడా, ఫిషరీస్ అధికారులు ఆక్వా రైతులకు అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతు సంఘాలన్నింటినీ సమీకరించి మహా ధర్నా చేపట్టనున్నట్లు గాంధీ భగవాన్‌రాజు వెల్లడించారు. సమావేశంలో ఆక్వా రైతు సంఘ నాయకులు బోనం వెంకట నరసయ్య (చినబాబు), మేడిది జాన్ డేవిడ్‌రాజు, కోడి విజయభాస్కర్, అంగర వర ప్రసాద్, యువరాజ్, గుంటూరు వెంకట సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు స్టేపై సంబరాలు



వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాలుస్తున్న మాజీ మంత్రి కారుమూరి, రాజేష్ నాథ్‌జీ

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న పశువధ కార్యకలాపాలపై హైకోర్టు స్టే విధించడంతో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద సంబరాలు నిర్వహించారు. కారుమూరితోపాటు పార్టీ శ్రేణులు బాణసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచారు. తేతలి గ్రామ మహిళలతోపాటు, గోసేవా సమితి, మాజీమంత్రి కారుమూరి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అండగా నిలబడి చేసిన ఉద్యమం వృథా కాలేదు. తేతలి పశువధ శాల ముందు నిరసన శిబిరం ఏర్పాటుచేయడమే కాకుండా తేతలి గ్రామ దేవత గోగులమ్మ తల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేసుకుని పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు తమకు కాకుండా ఫ్యాక్టరీ యాజమాన్యానికి సహకరించి పోలీసుల కాపలాతో పశువధ నిర్వహించినా గోగులమ్మ తల్లి కృపతో న్యాయస్థానం తమ గోడు విందని తేతలి వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బ్యూటీ పార్లర్‌లో మసాజ్‌లు

ఏలూరు పోలీసుల అదుపులో ఐదుగురు

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ ప్రాంతంలోని బ్యూటీపార్లర్‌పై పోలీసులు మంగళవారం దాడులు చేశారు. బ్యూటీపార్లర్‌లో మసాజ్ పేరుతో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయనే అనుమానాల నేపథ్యంలో టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. గత కొంత కాలంగా ఎస్ఎస్ బ్యూటీ పార్లర్ పేరుతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నిర్వాహకుడు నాగార్జునతో పాటు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. బ్యూటీ పార్లర్ పేరుతో నిర్వహించే ఈ సెంటర్‌లో బాడీ మసాజ్ చేస్తున్నారని, ఇతర ప్రాంతాలకు చెందిన యువతులను తీసుకువచ్చి ఇలాంటి పనులు చేయిస్తున్నారని సమాచారం. అదుపులోకి తీసుకున్నవారిలో విజయవాడకు చెందిన ఒక మహిళతోపాటు, యువతులు ఉన్నారు. దాడుల సమయంలో నిర్వాహకుడు పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ప్రతీ నెలా పోలీసులు దాడులు చేయకుండా ఒక వ్యక్తికి డబ్బులు చెల్లిస్తున్నానని, ఎందుకు దాడులు చేస్తున్నారంటూ ప్రశ్నించినట్లు సమాచారం. పోలీసులను మేనేజ్ చేసేందుకు రూ.30 వేలు నిర్వాహకుడి నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. పోలీసుల పేరుతో డబ్బులు వసూలు చేసిన వ్యక్తి ఎవరనే దానిపై చర్చ సాగుతోంది. గతంలోనూ అతనిపై ఏలూరు టూటౌన్ పరిధిలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులకు ప్రతీ నెలా డబ్బులు ఇవ్వాలంటూ పేకాట శిబిరాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారి నుంచి డబ్బులు వసూలు చేయటంలో అతను సిద్ధహస్తుడని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏలూరు త్రీటౌన్ పరిధిలోనూ కొంత కాలం క్రితం పేకాట శిబిరాన్ని నిర్వహించగా, పోలీసుల ఒత్తిడితో మానుకున్నట్లు తెలుస్తోంది.

కూటమి ఫ్లెక్సీలకు మినహాయింపు

జిల్లాలో అడుగడుగునా కోడ్ ఉల్లంఘన

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. నిబంధనల మేరకు రాజకీయ నాయకుల విగ్రహాలపై ముసుగులు కప్పడం, ఫ్లెక్సీలు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. అయితే జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు, రహదారుల పక్కన కూటమి నేతల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న సమయంలో ఇంత నిర్లక్ష్యమా? అంటూ అధికారుల తీరును చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. - సాక్షి, నెట్‌వర్క్



కాళ్లలో మండల పరిషత్ కార్యాలయంపై ఫ్లెక్సీ



పాలకోడేరు మండలం శృంగవృక్షం వద్ద రోడ్డు పక్కనే డిప్యూటీ సీఎం ఫ్లెక్సీ



పాలకోడేరు మండలం పెన్నాడలో..



పెంటపాడు మండలం బెండ్లంపాలెం వద్ద వెంకయ్య కాలువపై బల్లకట్టు



కాళ్ల మండలం జక్కరంలో కూటమి నాయకుల ఫ్లెక్సీ

క్లుప్తంగా

జైన మందిరంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ల: మండలంలోని పెదఅమిరంలో ఉన్న శ్రీ ఆదినాథ్ భగవాన్ జైన మందిరం పునఃప్రతిష్ఠ 10వ వార్షికోత్సవం కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ అమర ధ్వజారోహణ కార్యక్రమాన్ని భీమవరం కేసీ బుక్ డిపో అధినేత మహేంద్ర కుమార్ జైన్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్శ్వనాథ్ భగవాన్ ధ్వజారోహణం కాంతిలాల్ జైన్, విమల్ జైన్ కుటుంబికులు చేశారు. అనంతరం మందిర ఆవరణలో దర్శనార్థం వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు మహేంద్ర జైన్, వినోద్ జైన్, సోహన్‌రాజ్, రమేష్ జైన్, వీరేంద్ర జైన్, సురేష్ జైన్, దినేష్ జైన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

ఏలూరు రూరల్: అండర్ 16 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు మూడోస్థానంలో నిలిచిందని ఉమ్మడి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి కె.మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి 11 వరకూ పిఠాపురంలో ఆంధ్రప్రదేశ్ అండర్-16 యూత్ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న బాలికల జట్టు సెమీ ఫైనల్స్‌లో ఓటమి పాలై, మూడోస్థానం కోసం అనంతపురం జట్టుతో తలపడి 41-17 స్కోర్‌తో విజయం సాధించిందని వెల్లడించారు. లీగ్ దశలో జిల్లా బాలబాలికలు ప్రతిభ ప్రదర్శించారని అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు సంతోషం వ్యక్తం చేశారు.

మార్పులకు అనుగుణంగా విజ్ఞానాన్ని పెంచుకోవాలి

నూజివీడు: ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ పేర్కొన్నారు. స్థానిక శ్రీకాకుళం క్యాంపస్‌లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్‌పై విద్యార్థులకు వారం రోజుల పాటు నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అమరేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం ఈసీఈ విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల ప్రదర్శనను సందర్శించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా ఎం రాము, షేక్ రియాజ్ హుస్సేన్‌లు వ్యవహరించగా, ఈసీఈ హెచ్‌ఓడీ సుధ, క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి హెచ్ఎస్‌వీ వరప్రసాద్, అసోసియేట్ డీన్ అకడమిక్స్ చిన్నారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అభినందనలు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలోని విద్యార్థులు ఈనెల 7, 8, 9తేదీల్లో విజయవాడలో సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాస్య నాటికల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. దీనిలో భాగంగా విద్యార్థులు అంతిమ సంస్కారం అనే లఘునాటికను ప్రదర్శించి వీక్షకుల అభినందనలను అందుకున్నారు. సినీ ప్రముఖులు మిశ్రో, సుబ్బరాయశర్మ, కోట శంకరరావు విద్యార్థులను అభినందించినట్లు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

దివ్యాంగుల రైలు కష్టాలకు చెక్

ఏలూరు (టూటౌన్): రైల్వే పాసుల కోసం దివ్యాంగులు స్టేషన్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేసే విధానానికి రైల్వే శాఖ చెక్ పెట్టింది. దివ్యాంగుల రైల్వే పాసులను నేరుగా స్టేషన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో రైల్వే శాఖ వెబ్‌సైట్ ప్రారంభించింది. అందులోనే ఈ-టికెట్లు బుక్ చేసుకునే విధానాన్ని తీసుకువచ్చారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 58 వేల మంది వరకు దివ్యాంగులు ఉన్నారు. వీరిలో 60 శాతం మంది వరకు శారీరక వికలాంగులు, 15 శాతం అంధులు, 15 శాతం చెవిటి, మూగవారు, మరో 10 శాతం మంది బుద్ధిమాంద్యం కలిగిన వారు ఉన్నారు. దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలోకి ఈ రెండు జిల్లాలు వస్తాయి. గతంలో ఏలూరు రైల్వే స్టేషన్‌తో పాటు గుర్తించిన స్టేషన్‌లలో దివ్యాంగులకు రైల్వే పాస్‌లు అందించేవారు. దీని కోసం దివ్యాంగులు నానా కష్టాలు పడాల్సిన పరిస్థితి ఉండేది. తాజాగా రైల్వే శాఖ ప్రవేశ పెట్టిన ఆన్‌లైన్ విధానంతో దివ్యాంగులకు రైల్వే పాస్ కష్టాలు తప్పనున్నాయి.

పాస్ కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి

ఇకపై దివ్యాంగులు సమీప ఇంటర్‌నెట్ సెంటర్ లేదా తమ ఇంట్లోని కంప్యూటర్ నుంచి ఆన్‌లైన్‌లో https://divyangjanid.indianrail.gov.in వెబ్ సైట్‌లోకి వెళ్లి పాసు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులోనే యూనిక్ డిజబిలిటీ ఐడీ కార్డు (యూడీ ఐడీ) మంజూరు చేస్తారు. నూతన పాసులు కావాల్సిన వారు పాత పాసులు రెన్యూవల్ కోసం కూడా ఇందులోనే దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే వెబ్ సైట్ అమలులోకి వచ్చింది. దివ్యాంగులు ఓటీపీ ఆధారంగా ఆన్‌లైన్‌లోనే పాసు ఐడీ కార్డును తీసుకోవచ్చు. కొత్తగా దరఖాస్తు చేసుకునే సమయంలో తొలుత తన పేరు, ఆధార్‌కార్డు నెంబర్,ఫోన్ నెంబర్ ఎంటర్ చేసి, తర్వాత వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసి, తర్వాత వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసి లాగిన్ కావాలి. ఇలా ఎన్ని సార్లు అయినా లాగిన్ అయి తన దరఖాస్తును పరిశీలించుకోవచ్చు.





దివ్యాంగుల రైల్వే పాస్ లాగిన్ సైట్

దివ్యాంగులకు ఎంతో మేలు



రైల్వే శాఖ దివ్యాంగులు పాసులు పొందేందుకు ఆన్‌లైన్ విధానం ప్రవేశ పెట్టడం వల్ల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దివ్యాంగులు తాము ఉండే ప్రాంతం నుండి నెట్ సెంటర్, ఈ-సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని రైల్వేపాసులను పొందే వెసులు బాటు ఉంది. దీని వల్ల ఎంతో సమయం ఆదా అవ్వడంతో పాటు ఆర్థికంగా, శారీరకంగా శ్రమపడాల్సిన అవసరం ఉండదు.

– ఎస్‌వీ రమేష్, స్టేషన్ మేనేజర్,ఏలూరు

దివ్యాంగుల కష్టాలు తప్పాయి



దివ్యాంగులు రైల్వే పాసు తీసుకోవాలంటే నెలల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. గతంలో ముందుగా దివ్యాంగులకు సంబంధించిన అన్నిరకాల సర్టిఫికెట్లు విజయవాడ పంపించి అక్కడ వెరిఫికేషన్ పూర్తి అయ్యాక పాస్‌ను మంజూరు చేసేవారు. ప్రస్తుతం పాసులు పొందటానికి ఆన్‌లైన్ ప్రక్రియ రూపొందించడం సంతోషకరమైన విషయం.

– అల్లాడి నటరాజు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

లలితకుమారికి జాతీయ బంగారు నంది పురస్కారం



జాతీయ బంగారు నంది పురస్కారం అందుకుంటున్న రంగస్థల నటి కడలి లలితకుమారి

పాలకొల్లు అర్బన్: ప్రముఖ రంగస్థల నటి కడలి లలితకుమారికి తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జాతీయ బంగారు నంది పురస్కారంతో సత్కరించింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ వేదికపై సంస్థ సీఈఓ డాక్టర్ యూవీ రత్నం, జాతీయ కన్వీనర్ ధనాసి ఉషారాణి, పాడుతా తీయగా ఫేమ్ రాజాబాబు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది డా. జగదీశ్వర్ చేతుల మీదుగా బంగారు నంది, ప్రశంసాపత్రంతో శాలువాతో ఘనంగా సత్కరించారని లలితకుమారి మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా లలితకుమారిని పట్టణ కళాకారులు, సాహితీప్రియులు ప్రత్యేకంగా అభినందించారు.

సుందరగిరిపై పోటెత్తిన భక్తులు

స్వర్ణగరుడ వాహనంపై ఊరేగిన నారసింహుడు

ద్వారకాతిరుమల: స్వర్ణ గరుడ వాహనంపై శ్రీదేవీ, భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఐఎస్ జగన్నాథపురం క్షేత్ర పురవీధుల్లో మంగళవారం రాత్రి అట్టహాసంగా ఊరేగారు. సుందరగిరిపై జరుగుతున్న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ముందుగా ఆలయ ఆవరణలో గరుడ వాహనంపై కల్యాణ మూర్తులను ఉంచి, అర్చకులు, పండితులు విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం పూజాధికాలు జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత స్వామి వారి వాహనం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల నృసింహ నామస్మరణల నడుమ క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిట భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు. ఇదిలా ఉంటే ఉదయం ఆలయ ఆవరణలో నిత్యహోమాలు, మూలమంత్ర హవనాలు, బలిహరణలు, వేదపారాయణలను అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని సుందరగిరిపై భక్తులు పోటెత్తారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు, ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణలు పర్యవేక్షించారు.



స్వర్ణ గరుడ వాహనంపై ఊరేగుతున్న నారసింహుడు



పాలపొంగళ్లను స్వామివారికి నైవేద్యంగా సమర్పించేందుకు తీసుకెళ్తున్న భక్తులు



సుందరగిరిపై భక్తుల రద్దీ

పాలపొంగళ్ల నైవేద్యం

పెద్ద ఎత్తున మహిళా భక్తులు ఆలయ ఆవరణలో పాల పొంగళ్లను స్వయంగా వండి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం వారంతా నవగ్రహ, తులసి పూజలను జరిపి, భక్తి ప్రపత్తులతో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి ఏటా ఇలా పాలపొంగళ్లను స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తున్నట్లు పలువురు భక్తులు పేర్కొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ పరిధిలో ఒక వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు కుమ్మరిరేవు ప్రాంతానికి చెందిన కోడి సురేష్ (47) పెయింటింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. సురేష్ గత కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కూరగాయలు విక్రయించేందుకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి చేరుకోగా భర్త సురేష్ ఫ్యాన్‌కు వేళ్లాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీలో డిపార్ట్‌మెంట్ ప్రీమియర్ లీగ్-2025 ప్రారంభం

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో మంగళవారం క్రీడా సంరంభం ప్రారంభమైంది. నిత్యం సాకేంతిక పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు క్రీడల్లో దాదాపు నెల రోజుల పాటు మునిగి తేలేందుకు సిద్ధమయ్యారు. అకడమిక్స్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో బాలురకు, బాలికలకు వేరువేరుగా ఆటల పోటీలు, క్రీడా పోటీలను నిర్వహిస్తారు. దీనిలో భాగంగా డిపార్ట్‌మెంట్ ప్రీమియర్ లీగ్-2025 పేరుతో నిర్వహిస్తున్న ఈ పోటీలను మంగళవారం నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ఏఓ బి.లక్ష్మణరావులు ప్రారంభించారు. ఈ సంరంభంలో భాగంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, షటిల్, చదరంగం, ఫుట్ బాల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ హెచ్‌ఓడీ సీహెచ్ నవీన్‌కుమార్, డీన్ అకడమిక్స్ చిరంజీవి, పి.సూర్యచంద్రరావు, సుబ్బలక్ష్మి, జి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్

రైలు కింద పడి వృద్ధ దంపతుల ఆత్మహత్య

ఉంగుటూరు/పెంటపాడు: ఉంగుటూరు ప్రాంతంలో రైలుకింద పడి మంగళవారం తెల్లవారుజామున వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. తాడేపల్లిగూడెం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తాడేపల్లిగూడెం మండలం తాళ్లముదురుపాడుకి చెందిన తాడి వెంకటరెడ్డి (62) ఆయన భార్య తాడి విమలాదేవి (52) సోమవారం రాత్రి మోటారు సైకిల్ పై ఉంగుటూరు వచ్చారు. మోటారు సైకిల్‌ను జాతీయ రహదారి పక్కన ఉంచి రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వైపునకు ట్రాక్ మీదుగా వస్తున్న రైలు కింద తలపెట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయం స్థానికుల చూసే సరికి మృతదేహాలు మాంసం ముద్దల్లా మారిపోయాయి. సంఘటన స్థలంలో లభ్యమైన సెల్‌ఫోన్ ఆధారంగా వారి వివరాలు కుటుంబ సభ్యులకు పోలీసులు తెలియజేశారు. ఈ దంపతులు సోమవారం రాత్రి వారు అద్దె ఇంట్లో నివసించే పోర్షన్ల వారితో పొద్దుపోయే వరకు సరదాగా మాట్లాడినట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు. అయితే ఏ సమయంలో ఉంగుటూరు వెళ్లారో? తెలియదని పేర్కొంటున్నారు. మృతి చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వారికి గతంలోనే వివాహాలు అయ్యాయి. ఈ సంఘటన గురించి తెలియడంతో మంగళవారం ఉదయం ముదునూరుపాడు పుట్టింటికి వచ్చారు. తల్లిదండ్రుల చివరిచూపు కూడా దక్కకుండా దూరమయ్యారంటూ వారి రోధన స్థానికులను కంటతడి పెట్టించింది. అయితే తమ తల్లిదండ్రుల ఆత్మహత్యకు గల కారణాలు తమకు తెలియదని చెబుతున్నారు. కానీ అప్పుల బాధతోనే వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని రైల్వే పోలీసులు తెలిపారు.

విజిలెన్స్ దాడుల్లో చేపల మేత సీజ్

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో చేపల మేతలు, మందుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజనల్ విజిలెన్స్ అధికారి వి.రాంబాబు ఆదేశాల మేరకు ఏలూరు నగరంలో దాడులు చేపట్టారు. విజిలెన్స్, మత్స్యశాఖ, రెవెన్యూ, డ్రగ్స్ తనిఖీ అధికారులు సంయుక్తంగా ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లోని మెస్సర్స్ శ్రీ పృథ్వీ ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్ షాపులో ఎలాంటి ఫిషరీస్ లైసెన్స్ లేకుండానే చేపల మేతలు, చేపల మందులు విక్రయాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు రూ.40,73,329 విలువైన 28.966 టన్నుల చేపల మేతలు, మందులు సీజ్ చేశారు. అదేవిధంగా మెస్సర్స్ స్టార్ ఆక్వా ఫీడ్స్‌లో ఎలాంటి ప్రభుత్వ లైసెన్సులు లేకుండా చేపల మేతలు, మందులు విక్రయిస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో గుర్తించి రూ.20,51,607 విలువైన 16.810 టన్నుల చేపల మేత, మందులు సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ పీ.శివరామకృష్ణ, సీఐ డి.ప్రసాద్‌కుమార్, విజిలెన్స్ ఏఓ జి..మీరయ్య, విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి, విజిలెన్స్ ఎస్సై కె.రాంబాబు, మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



సీజ్ చేసిన చేపల మేతతో విజిలెన్స్ అధికారులు

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

పెనుగొండ: జిల్లాలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను ఆచంట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి నుండి ఏడు మొబైల్ ఫోన్లు రికవరీ చేశామని ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు. వాటి విలువ రూ.1,50,000 ఉంటుందని పేర్కొన్నారు.

మ్యాజిక్ బోస్‌కు ఐబీఆర్ అచీవర్ అవార్డు

భీమవరం: పట్టణానికి చెందిన ఇంద్రజాలికుడు, రచయిత మ్యాజిక్ బోస్‌ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఐబీఆర్ అచీవర్ అవార్డుకు ఎంపిక చేసింది. బోస్ ఇంగ్లీష్‌లో రచించిన 'ది రోల్ ఆఫ్ మ్యాజిక్ అండ్ మెజీషియన్స్ ఇన్ ది ఎర్లీ మూవీస్'అనే పరిశోధనా గ్రంథానికిగాను ఐబీఆర్ అచీవర్ అవార్డును ఈ నెల 1న ప్రకటించింది. ఈ మేరకు ప్రశంసాపత్రంతో పాటు అవార్డును ఆయన పోస్ట్ ద్వారా ఇటీవల అందుకున్నారు. మ్యాజిక్ అండ్ మెజీషియన్స్ ఇన్ ది ఎర్లీ మూవీస్ గ్రంథాన్ని బోస్ 2023లో రచించి, తానే ప్రచురించి విశాఖపట్నంలో ఆవిష్కరించారు. బోస్‌ను పట్టణంలో పలువురు ప్రముఖులు అభినందించారు.



ఐబీఆర్ అచీవర్ అవార్డుతో మ్యాజిక్ బోస్

జేఈఈ మెయిన్స్‌లో పాలకొల్లు విద్యార్థి ప్రతిభ

యలమంచిలి: పాలకొల్లు పట్టణానికి చెందిన కోటిపల్లి యశ్వంత సాత్విక్ జేఈఈ మెయిన్స్ తొలి సెషన్ ఫలితాల్లో 99.99 పర్సంటైల్ సాధించాడు. ఈడబ్ల్యూఎస్ కోటాలో ఆల్ ఇండియాలో మొదటిస్థానం సాధించాడు. యశ్వంత్ రాజమహేంద్రవరం తిరుమల కళాశాలలో చదువుతున్నాడు. పాలకొల్లుకు చెందిన కోటిపల్లి వెంకట సత్యనారాయణ (నాని), గీతావాణి దంపతులకు యశ్వంత్ మూడో కుమారుడు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్‌లో చదవడమే తన లక్ష్యమని చెప్పాడు.



కోటిపల్లి యశ్వంత సాత్విక్

భర్త, అత్త వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం

ఉండి: భర్త అత్త వేధింపులు భరించలేని మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెరుకువాడకు చెందిన కొండవేటి మహేశ్వరికి అదే గ్రామానికి చెందిన సురేష్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పిల్లలను వదిలి గత రెండేళ్ల నుంచి చెరుకువాడలోని తల్లి ఇంటివద్దే ఉంటుంది. కొన్ని రోజుల క్రితం కుమారుడికి ప్రమాదం జరగడంతో చూసేందుకు అత్తారింటికి వెళ్ళిన మహేశ్వరిని భర్త,అత్త సూటిపోటి మాటలతో వేధింపులకు గురి చేయడంతో భరించలేని ఆమె సోమవారం మధ్యాహ్నంవిషం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమె ప్రస్తుతం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

పశువధశాలపై న్యాయం చేకూరింది



తణుకు అర్బన్: పశువధ కర్మాగార కార్యాకలాపాలను తక్షణం నిలిపివేయాలని హైకోర్టు స్టే విధించడం ప్రజా స్వామ్య విలువలకు, ప్రజా ఉద్యమాలకు న్యాయం సమకూరిందనే విశ్వాసం ప్రజల్లో కలిగిందని శాసనమండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక ప్రజలు, గోసేవా సమితి, రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలు చేసిన పోరాటానికి న్యాయం జరిగిందని అన్నారు. కర్మాగార ప్రాంత ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారని, ఫ్యాక్టరీ యాజమాన్యం అమానుషంగా వ్యవహరించిందని, నిబంధనలు ఉల్లంఘించారని స్పష్టం చేశారు. ఇకపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కర్మాగార యాజమాన్యం కోర్టులో స్టే వెకేట్ చేయించడానికి గట్టి ప్రయత్నాలు చేయగలదని ఆ చర్యలను పసిగడుతూ తగిన విధంగా పోరాటం చేయాలని అన్నారు. ఈ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

తడి, పొడి చెత్తలను పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ వెంకటేష్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తల నుంచి కంపోస్టు తయారు చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం చేకూరుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి ఈ ఆదాయం తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివ్య, ఎంఆర్‌సీ రవికిరణ్, టీడీపీ నాయకుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సోలార్ వ్యవస్థతో విద్యుత్ వ్యయం ఆదా



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వనాథ్, పాల్గొన్న ప్రజలు

తాడేపల్లిగూడెం రూరల్: సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ వ్యయాన్ని ఆదా చేసుకోవచ్చని ఎంపీడీవో ఎం విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ ఆసక్తి గల వారు రూ.2.10లక్షలు చెల్లిస్తే సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తారన్నారు. ప్రభుత్వ సబ్సిడీ లబ్ధిదారుని ఖాతాకు జమ అవుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, విద్యుత్ ఏఈ అల్లు రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాల వద్ద వాహన తనిఖీలు



ఎల్.అగ్రహారం టిడ్కో గృహ సముదాయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్సై ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారం టిడ్కో గృహ సముదాయం వద్ద మంగళవారం రూరల్ ఎస్సై జేవీఎన్.ప్రసాద్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన రికార్డులు, హెల్మెట్, లైసెన్స్‌లను పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జేఈఈలో సెంట్ ఆన్స్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న సెంట్ ఆన్స్ విద్యాసంస్థల అధినేత అద్దంకి విజయకుమార్

తాడేపల్లిగూడెం: జేఈఈ మెయిన్స్ 25లో పట్టణానికి చెందిన సెంట్ ఆన్స్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఆర్‌బిఎల్ చంద్రిక 98.79 పర్సంటైల్ సాధించినట్లు సంస్థ చైర్మన్ అద్దంకి విజయకుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు. పటిష్టమైన ప్రణాళికతో, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధించడం వల్ల తమ విద్యార్థులు జాతీయ ర్యాంకులు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో పెరుగుతున్న డ్రగ్స్ కల్చర్

గంజాయి అడ్డాలుగా
భాగ్యలక్ష్మిపేట, పడాల గరువు



గూడెం పోలీసులు పట్టుకున్న గంజాయి నిందితులు (ఫైల్)

తాడేపల్లిగూడెం: యువత జీవితాలను అథోగతి పాలు చేసే గంజాయి, డ్రగ్స్ సంస్కృతి తాడేపల్లిగూడెం ప్రాంతంలో పెరుగుతుంది. గంజాయిని మించి నెమ్మదిగా కొకైన్ వంటి డ్రగ్స్‌ను వినియోగించే జాఢ్యం ఇటీవల జిల్లాలో నెమ్మదిగా వ్యాపిస్తోంది. గతేడాది అక్టోబరులో తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు దొరికిన ఒక గ్యాంగ్ ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ గ్యాంగ్ ద్వారా తాడేపల్లిగూడెం పట్టణం, పరిసర మండలాల్లో గంజాయి సరఫరా విచ్చలవిడిగా సాగుతున్నట్టు తెలుస్తోంది. దీంతో పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేయడంతో గత నెలలో గూడెం మండలంలో తాజాగా గూడెం పట్టణంలో గంజాయి సరఫరా చేసే ముఠాను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అయితే వీరిలో గూడెం యువతతో పాటు నల్లజర్ల మండలం తెలికిచర్ల గ్రామానికి చెందిన యువకులు కూడా ఈ ముఠాలో ఉన్నారు. వారి నుంచి 13 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. త్రిమూర్తులు వ్రతం చేసుకోవాలంటే గంజాయి ధూపం వేసే అలవాటు ఉంది. పట్టణంలోని శివాలయం, వార్‌రోడ్డు, చిన్న వంతెన ప్రాంతంలో గతంలో సాధువులు గంజాయిని తాగడంతో పాటు, వ్రతాలకు చిన్న పొట్లాలతో కలిసి విక్రయించేవారు. అయితే గత కొన్నేళ్లుగా గంజాయి మీద ఆంక్షలతో ఈ విక్రయాలు ఆగాయని అందరూ అనుకున్నారు. కానీ తాడేపల్లిగూడెం మండలంలోని పడాల గరువు, పట్టణంలోని భాగ్యలక్ష్మిపేట, మసీదు వీధి వంటి ప్రాంతాల్లో గంజాయి అమ్మే ముఠాలు వ్యాపారాలు సాగిస్తున్నాయని సమాచారం. కొబ్బరితోట ప్రాంతంలో కూడా గంజాయి సరఫరా జరుగుతున్నట్టు పోలీసుల నిఘాలో వెల్లడైంది. తాజాగా చూపించిన కేసులో ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తులు కూడా ఉన్నారు.

కొరియర్ ద్వారా తాడేపల్లిగూడేనికి డ్రగ్స్

తాడేపల్లిగూడెం ప్రాంతంలో గంజాయితో పాటు డ్రగ్స్ సంస్కృతి కూడా పట్టణంలో చిన్నగా మొదలైనట్టుగా ఉంది. రహస్యంగా సాగిస్తున్న ఈ వ్యవహారం గతేడాది అక్టోబరులో పోలీసులు ఛేదించిన ఓ కేసులో గూడెం కేంద్రంగా డ్రగ్స్ సరఫరా సాగుతున్నట్టు వెల్లడైంది. పట్టణానికి చెందిన డి.దినేష్ అనే వ్యక్తి టెలిగ్రామ్ అనే యాప్ ద్వారా వచ్చే లింక్స్ ద్వారా 32 వేల రూపాయలు విలువచేసే క్రిప్టో కరెన్సీ ద్వారా నాలుగు గ్రాముల ఎండీఎంఏ (కొకైన్)ను ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకొని ఓ కొరియర్ ద్వారా ఢిల్లీ నుంచి తాడేపల్లిగూడెం తెచ్చుకున్నారు. దినేష్‌కు ఇక్కడున్న పవన్, అజయ్, పుష్పరాజ్, గగన్ అనే స్నేహితులు ద్వారా తాడేపల్లిగూడెం వచ్చిన డ్రగ్‌ను స్నేహితులు తూర్పుగోదావరి జిల్లాకు తీసుకెళుతూ మార్గమధ్యంలో అన్నవరం రైల్వే స్టేషన్‌లో 50 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశారు. రాజానగరం మండలం జి.ఎర్రంపాలెం గ్రామపరిధిలో భూపాలపట్నం నుంచి ఎర్రంపాలెం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న సిరా స్టూడియో స్పేస్ గెస్టు హౌస్ వద్ద పుట్టినరోజు పార్టీ చేసుకున్నారు. వీటితో పాటు అనుమతిలేని కర్ణాటక మద్యం తెచ్చుకున్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులకు సమాచారం అందింది. 2024 అక్టోబరు పదోతేదీన కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు రాజానగరంలో పోలీసు స్టేషన్‌లో గూడెం యువకులపై క్రైమ్ నంబరు 410/2024 కింద కేసు కట్టారు. ఎన్‌డీపీఎస్ యాక్టులోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. డ్రగ్, గంజాయి. వాహనాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో డ్రగ్, గంజాయి లింకులు గూడెంలో ఉన్నట్టుగా రూఢీ అయ్యింది.

ఎవ్వరీ దినేష్?

ఈ యువకుడు తాడేపల్లిగూడెం ప్రాంతంలో యువతకు డ్రగ్స్ వంటి వాటిని సరఫరా చేసి మత్తులో ముంచే వ్యక్తిగా పోలీసుల వద్ద సమాచారం ఉంది. సదరు యువకుని కుటుంబ నేపథ్యం కూడా ఇదే రీతిలో ఉందని పోలీసుల రికార్డుల ప్రకారం తెలుస్తోంది. కుటుంబీకుల వారసత్వాన్ని అంది పుచ్చుకున్నట్టుగా ఈ యువకుడి తండ్రి, సదరు యువకుడు కూడా పట్టణంలోని పడాల గరువు, భాగ్యలక్ష్మిపేటలను అడ్డాలుగా చేసుకుని అక్రమాలు చేస్తున్నట్టుగా విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా రాజమండ్రి, విశాఖ కేంద్రాలుగా దినేష్ అనే యువకుడు అక్రమాలు చేస్తున్నాడని రాజానగరం పోలీసుల దర్యాప్తులో బహిర్గతమైనట్టుగా తెలుస్తోంది.



నిఘా ఉంచాం

గంజాయి అక్రమ రవాణా, డ్రగ్స్ వంటివి కూడా వినియోగిస్తున్నారా?విక్రయిస్తున్నారా? అనే విషయంపై పూర్తిస్థాయి నిఘా ఉంచాం. విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక సోదాలు నిర్వహించాం. సమాచారం ఉంటే ఎలాంటి వారిని ఉపేక్షించం. నేరచరిత్ర ఉన్న వారిని స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. తూర్పుగోదావరి ఘటనలో నిందితులుగా ఉన్నవారికి ఇటీవల స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చాం.

– సుబ్రహ్మణ్యం, సీఐ తాడేపల్లిగూడెం

ఆపరేషన్ కగార్ ఆపివేయాలి



మాట్లాడుతున్న కృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆపరేషన్ కగార్ ఆపివేయాలని, సహజ వనరులను కాపాడుకుందాం, కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండను ఖండిస్తూ మంగళవారం స్థానిక కపర్ది భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ అధ్యక్షత వహించారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.చిట్టిబాబు, ఐజేయూ నాయకుడు డి.సోమసుందర్‌లు పాల్గొన్నారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న సహజ వనరుల దోపిడీ కోసం కగార్ యుద్ధం జరుగుతుందన్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో ఆదివాసీలను, ముఖ్యంగా మహిళలను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ యుద్ధాన్ని ఆపాలని, సహజ వనరులపై దేశ పౌరలందరికి హక్కు ఉందని, గిరిజన చట్టాలను అమలు చేయాలని, రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు ఎం.దాన వరప్రసాద్, బహుజన సేన నాయకులు సత్యకృష్ణ, కేఎన్‌పీఎస్ నాయకులు జాన్‌రాజు, వేమన ఫౌండేషన్ నాయకులు ప్రసాద్, పీకేఎస్ జిల్లా సభ్యులు పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులను అరికడదాం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): కీటక జనిత వ్యాధులను అరికడదామని పట్టణ సబ్ యూనిట్ హెల్త్ ఆఫీసర్ వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వీకర్స్ కాలనీ, బేబి సెంటర్ పరిధిలోని 1, 9 వార్డుల్లో మంగళవారం వెక్టర్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు, ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలు జరిగాయి. ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఆరోగ్య, పోషణ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది తప్పక ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు పద్మ, వార్డు ఆరోగ్య కార్యకర్తలు మల్లికా, మేరీ, వెంకట లక్ష్మి, భవాని, దుర్గ, సుజాత, కోమలి, లక్ష్మి, కాంతారావు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం



ఘంటసాల విగ్రహం వద్ద పూజలు చేస్తున్న గాన సభ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఘంటసాల గానం అజరామరం అని అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికా రాణి ఉడయార్ అన్నారు. ఘంటసాల గానసభ సభ ఆధ్వర్యంలో 48వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం స్థానిక వీకర్స్‌కాలనీలోని ఘంటసాల విగ్రహం వద్ద ఘంటసాలకు పూజలు నిర్వహించారు. గాన సభ అధ్యక్షుడు ఎస్.ఖాసిం సాహెబ్, సలహాదారు పీటీ వెంకన్న, ఉపాధ్యక్షుడు అల్లం శంకరరావు, కార్యదర్శి డి.కృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎస్‌కే నాగూర్ సాహెబ్, కోశాధికారి ఎస్.ఎస్.ఆర్ మూర్తి, లు పర్యవేక్షించారు. ఇండియన్ ఐడల్ విన్నర్ నజారుద్దీన్‌కు దుశాలువా వేసి, కంకణం తొడిగి సత్కరించారు. ఎస్‌బీఐ విశ్రాంత జనరల్ మేనేజర్ జీజీకే మూర్తి, ఈవీవీ సత్యనారాయణ, దుర్గారావు, నాగూర్, తీడా జగదీష్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు. రాత్రి స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో బీవీఆర్ వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షతన ఘంటసాల సంగీత విభావరి జరిగింది. ఘంటసాల అవార్డును డాక్టర్ ఎస్‌పీఎస్ వాసు (ఏలూరు), ప్రముఖ నాదస్వర విద్వాంసులు నాగూర్ సాహెబ్, మదీనా బీబి అవార్డును తెలుగు సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాసరావుకు అందజేశారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు, సాహితీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత తాడేపల్లిగూడెంగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా ఆరోగ్యం కోసం పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత తాడేపల్లిగూడెంగా తీర్చిదిద్దుతామని మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు వెల్లడించారు. పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ ఎస్.రాజు, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ ఎస్‌వీ శ్రీమన్నారాయణ, సోమేశ్వరరావు, సిబ్బంది, సెక్రటరీలు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పలు చోట్ల ప్లాస్టిక్ వాడుతున్న వివిధ షాపులు, బడ్డీలు వద్ద నుంచి తక్కువ మైక్రాన్స్ కలిగిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను, ఇతర ప్లాస్టిక్‌ను సుమారు 500 కేజీలను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారస్తులు వద్ద నుంచి రూ.1500 అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఆఫీస్ వద్ద కమీనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గేందుకు వ్యాపారస్తులు, ప్రజలు భాగస్వాములు కావాలని, మునిసిపాలిటీకి సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ టీ గ్లాసులను నిరోధించినట్లు చెప్పారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ఇస్తున్న వారిపై తప్పని సరిగా చర్యలు ఉంటాయని, ఫైన్‌లు కట్టిస్తున్నట్టు వెల్లడించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గడంతో పాటు తడి చెత్త, పొడి చెత్తలను పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని విజ్ఞప్తి చేశారు. తడి చెత్తను కంపోస్టుగా వాడటం, మొక్కలను పెంచుకోవచ్చునని వివరించారు.

కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

పెంటపాడు: జిల్లాలో కౌలు రైతుల కోసం సమగ్ర చట్టం రావాలని, వారి అభ్యున్నతికోసం కూటమి ప్రభుత్వం తీవ్ర కృషి చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు తాటిపాముల రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం పెంటపాడు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నేడు మార్పులు చోటు చేసుకొన్న సందర్భంలో కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ ఎనిమిది నెలల కాలంలో 97 మంది రైతులు రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు వంకా అప్పారావు, ఉయ్యూరి సత్యనారాయణ, దిద్దే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌జీ విద్యార్థి ప్రతిభ



విద్యార్థి బాబును అభినందిస్తున్న దృశ్యం

పెంటపాడు: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. ఆ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. రాజమండ్రిలో అంతర్ విశ్వవిద్యాలయ హ్యాండ్‌బాల్ పోటీలకు పెంటపాడు డీఆర్ గోయంకా డిగ్రీ కళాశాల విద్యార్థి బైపో బాబు ఎంపికయ్యాడు. మంగళవారం ఆ విద్యార్థిని కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్ ఇన్‌చార్జి జె. విజయబాబు, పీడీ అజ్జిబాబు, లెఫ్టినెంట్ ప్రేమ్‌సాగర్, అధ్యాపకులు గంధం వాణి తదితరులు పాల్గొన్నారు.

పేకాట, కోతాటలకు అడ్డాగా మారిన తణుకు



పైడిపర్రులో ఫ్లెక్సీ వివాదంలో గాయపడ్డ యువకుడిని పరామర్శిస్తున్న మాజీమంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : మండలంలోని పైడిపర్రులో ఇటీవల ఒక ఫ్లెక్సీ వివాదంలో జరిగిన దాడిలో గాయపడ్డ యువకుడు వేమన మధును మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ గొడవకు సంబంధం లేకపోయినా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్న యువకుడిపై దాడికి దిగడం బాధాకరమని అన్నారు. అత్యంత దారుణంగా చాకుతో చీరేసిన వైనం రౌడీ మూకలు ఏ మేరకు పేట్రేగిపోతున్నాయో తెలుస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తణుకు ప్రాంతంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పేకాటలు, కోతాటలు, క్రికెట్ బుకీల పేరుతో రౌడీ మూకలు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ యువకులపై దాడులకు దిగుతున్నారని విమర్శించారు. ముఖ్యంగా పైడిపర్రు ప్రాంతం పేకాట స్థావరంగా మారిపోయిందని ఇళ్ల మధ్యనే పేకాట ఆడుతూ రౌడీ మూకలు, నేర చరిత్ర కలిగినవారు ఇబ్బందులకు గురిచేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే, పోలీసులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పేకాట నిర్వాహకులు ఇస్తున్న మామూళ్లకు లొంగిపోయి పాలకులు, పోలీసులు వారికి వత్తాసుగా ఉంటున్నారని స్పష్టం చేశారు. రోజులు, నెలవారీ మామూళ్ల మత్తులో కళ్లకు గంతలు కట్టుకోవడంతో పోలీస్‌స్టేషన్ ముందే దాడి జరిగినా పోలీసులు పట్టించుకోలేదని, పోలీస్‌స్టేషన్ పక్కనే నిత్యం పేకాట నడుస్తున్నా మామూళ్ల మత్తులో ఊగుతున్నారని అన్నారు. ఇప్పటికే గేదెల చోరీ వ్యవహారంలో ఒక ఎస్సై ఆత్మహత్య చేసుకున్నా పోలీసుల్లో ఎటువంటి చలనం రాలేదని దుయ్యబట్టారు. పేకాట, క్రికెట్ బుకీల కారణంగా యువత చెడిపోతున్నారని, ఇళ్లు గుల్ల చేసి అప్పులపాలైపోయి అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే తనకున్న అధికారంతో తగిన చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో తణుకులో నిర్వహిస్తున్న పేకాట, కోతాటలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, పార్టీ నాయకులు చినిమిల్లి సాంబశివరావు, కంచుమర్తి విశ్వేశ్వరరావు, కొత్తపల్లి చరణ్ పాల్గొన్నారు.

పెదతాడేపల్లిలో బేటీ బచావో... బేటీ పఢావో



పెదతాడేపల్లి గ్రామంలో చిన్నారుల తల్లిదండ్రులకు మొక్కలను అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో మంగళవారం బేటీ బచావో... బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎస్తేరు రాణి బాల్య వివాహాలు నియంత్రణ, వాటి వల్ల కలిగే అనర్థాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఎర్లీ ఇంటర్వెన్షన్‌లో రామకృష్ణకు గోల్డ్ మెడల్



యనమండ్ర రామకృష్ణ, తణుకు

తణుకు అర్బన్: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ మెంటల్ హెల్త్‌లో ఎర్లీ ఇంటర్వెన్షన్‌లో పీజీ డిప్లొమాను పూర్తి చేసి తణుకు పట్టణానికి చెందిన యనమండ్ర రామకృష్ణ రాష్ట్రంలో మొట్టమొదటి ఎర్లీ ఇంటర్వెన్షనిస్టుగా నమోదు కాబడ్డారు. ఈ కోర్సుకు సంబంధించిన పరీక్షల్లో యూనివర్సిటీ టాపర్‌గా అత్యధిక మార్కులు సాధించడంతో ఆయనకు గోల్డ్ మెడల్ ప్రకటించారు. ఇంతకుముందు రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) గుర్తింపు పొందిన క్లినికల్ సైకాలజీ కోర్సును పూర్తి చేసి పశ్చిమ గోదావరి జిల్లాలో మొట్టమొదటి క్లినికల్ సైకాలజిస్టుగా గుర్తింపు పొందినట్లు ఆయన తెలిపారు. తణుకు పట్టణానికి చెందిన వ్యక్తి ఇంతటి అరుదైన విద్యలో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తణుకు శాసన సభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ, శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్, మాజీ మునిసిపల్ చైర్మన్ పరిమి వెంకన్న బాబు, ఎంసీ మాజీ చైర్మన్ చీర్ల రాధయ్య తదితర పట్టణ ప్రముఖులు రామకృష్ణను అభినందించారు.

మానవ తప్పిదాలే ప్రమాదాలకు కారణం



తణుకులో రోడ్డు భద్రతా వారోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాస్

తణుకు అర్బన్: మానవ తప్పిదాల కారణంగానే అధిక శాతం ప్రమాదాల్లో ప్రాణ నష్టం సంభవిస్తుందని తణుకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తణుకు రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వాహనదారులు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమన్నారు. బస్సులు, లారీలు నడిపే డ్రైవర్లు ఏకాగ్రతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనుమలక్ష్మి, డ్రైవింగ్ స్కూల్ డ్రైవర్లు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు జీవన ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కుటుంబ పెన్షనర్స్ తప్పక తమ తమ జీవన ప్రమాణ పత్రాలు ఈ నెల 28వ తేదీ లోపుగా సమర్పించాలని, 17 రోజులు గడువు మాత్రమే ఉందని పెన్షనర్స్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్ వెల్లడించారు. పెన్షనర్స్ భవనంలో మంగళవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన ప్రమాణ పత్రాలు అందజేయడంలో ఏమైనా సాంకేతికపరమైన ఇబ్బందులు ఉంటే తగు పరిష్కారాలు ట్రెజరీ సిబ్బందిని ఆశ్రయించాలన్నారు. నేటి వరకు 3,065 పెన్షనర్స్‌కు 2421 మంది జీవన ప్రమాణ పత్రాలు దాఖలు చేసుకున్నారని, 644 మంది దాఖలు చేసుకోవాల్సి ఉందని, తప్పక దాఖలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పిల్లల్లో మనోధైర్యాన్ని కల్పించండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లల్లో మనోధైర్యాన్ని కల్పించాలని ఎంఈఓ–2 పీఎంకే జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంను ఎంఈఓ మంగళవారం పరిశీలన చేశారు. భవిత కేంద్రంలోని రికార్డులను, ప్రత్యేక విద్య పిల్లల సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లల తల్లిదండ్రులతో ఎంఈఓ మాట్లాడారు. పిల్లలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు అందజేస్తున్న ఉచిత సేవలను తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు.భవిత ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, నాగలక్ష్మి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండ్రుప్రోలులో కల్యాణ మహోత్సవం



ఉయ్యూరు వీరమ్మ, కనక చింతయ్యలకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో ఉయ్యూరు వీరమ్మ, కనక చింతయ్య కల్యాణ మహోత్సవాలు సోమ వారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించా రు. ఈసందర్భంగా ఉదయంనుంచి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు జరిపారు. సాయంత్రం నిప్పుల గుండం తొక్కే కార్య క్రమం నిర్వహించారు.

దీన దయాళ్ జీవితం ఆదర్శనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దీన దయాళ్ ఉపాధ్యాయ జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో దయాళ్ 58వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దీన దయాళ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోట రాంబాబు, కోకన్వీనర్ రమగాని సత్యనారాయణ, బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వి.నారాయణ, పాటి నాగేశ్వరరావు, కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు, తుమరాడ చిన్న, చిట్యాల రాంబాబు, అంజి తదితరులు పాల్గొన్నారు.